క్లుప్తంగా

హాస్పిటల్‌కు వెళ్లి పింఛన్ అందజేత



పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి వెళ్లి లబ్ధిదారుకు పింఛన్ అందిస్తున్న వలంటీర్

బలిజిపేట: మండలంలోని అరసాడకు చెందిన కె.మోహనరావు అనారోగ్యంతో పార్వతీపురం జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. గ్రామానికి చెందిన వలంటీర్ బి.ఝాన్సీ గురువారం అక్కడికి వెళ్లి పింఛన్ అందజేసింది. వృద్ధాప్య పింఛను లబ్ధిదారుకు వలంటీర్ వెళ్లి పింఛన్ అందించడంపై గ్రామస్తులు, లబ్ధిదారు కుటుంబీకులు అభినందించారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ ఎన్వీ రమణ, ఎస్సై కె.నీలకంఠం

సీతానగరం: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో పదోతరగతి గదిలో ఏర్పాటు చేయనున్న పోలింగ్ కేంద్రాన్ని తహసీల్దార్ ఎన్వీ రమణ, ఎస్సై కె.నీలకంఠం గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శాసనమండలి పట్టభద్రుల ఎన్నికలను పురస్కరించుకుని పోలింగ్ కేంద్రంలో ఓటింగ్ కోసం వచ్చిన ఓటర్లకు వెలుతురు, గాలి, రాకపోకల వసరులను పరిశీలించినట్లు చెప్పారు. మండలంలో అత్యధిక మంది ఓటర్లు ఉన్నారని తెలియజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, వీఆర్వో పైల కుమార స్వామి పాల్గొన్నారు.

ఆధార్ అప్‌డేట్ వేగవంతం చేయాలి

సీతానగరం: తహసీల్దార్ కార్యాలయలం ఆవరణలో ఏర్పాటు చేసిన ఆధార్ అప్‌డేట్ కేంద్రంలో ప్రజలకు మెరుగైన సేవలందించాలని తహసీల్దార్ ఎన్వీ రమణ సూచించారు. ఈ మేరకు గురువారం ఆయన ఆధార్ అప్‌డేట్ సెంటర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇక్కడి సెంటర్‌లో సేవలు నత్తనడకన సాగుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు దాన్ని రూపుమాపేందుకు వేగవంతంగా అప్‌డేట్ చేయాలని స్పష్టం చేశారు. అలాగే బూర్జ, అంటిపేట సచివాలయాల్లో ఆధార్ సెంటర్లు పని చేస్తున్నాయని తెలియజేశారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పెదపెంకిలో నిత్యాన్నదానం



పెదపెంకిలో అన్నప్రసాదం స్వీకరిస్తున్న నిరుపేదలు

బలిజిపేట: ప్రతి రోజూ 10మంది నిరుపేదలకు నిత్యాన్నదానం చేసే కార్యక్రమాన్ని అమ్మ చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు జి.పకీరునాయుడు మండలంలోని పెదపెంకి గ్రామంలో గురువారం ప్రారంభించారు. గ్రామంలో నిరుపేదలైన 10మందిని గుర్తించి నిత్యం వారికి అన్నదానం చేయనున్నట్లు ఈ సందర్భంగా పకీరునాయుడు తెలిపారు. అన్నదానాన్ని మించిన దానం మరొకటిలేదన్న పెద్దల సూక్తితో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఈర్ల సంజీవనాయుడు, డాక్టర్ దివాకర్‌బాబు, గ్రామస్తులు పాల్గొన్నారు.

లక్ష్మీనృసింహ స్వామికి పుష్పాలంకరణ



భక్తులకు దర్శనమిచ్చిన లక్ష్మీనృసింహ స్వామి

సీతానగరం: మండల కేంద్రంలో సువర్ణముఖి నది ఒడ్డున వేంచేసిన వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో వెలసిన లక్ష్మీనృసింహ స్వామి ప్రత్యేక పుష్పాలంకరణలో భక్తులకు గురువారం దర్శనమిచ్చారు. ఈ మేరకు ఆలయ అర్చకుడు శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో వేకువ జామునుంచే స్వామివారిని పుష్పాలతో అలంకరించారు. ఉదయం 5 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ స్వామికి పూజలు, అభిషేకాలు నిర్వహించగా దూర ప్రాంతాలనుంచి వచ్చిన పలువురు భక్తులు పూజల్లో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు వితరణ చేశారు.

ప్రజలకు బాధ్యులు గృహసారథులే

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురంటౌన్:

ప్రజల అవసరాలను తెలుసుకుని పరిష్కరించే ప్రధాన బాధ్యత గృహ సారథులదేనని ఎమ్మెల్యే జోగారావు అన్నారు. పార్వతీపురం పురపాలక సంఘం పరిధిలోని బెలగాం ప్రాంతం సుందరనారాయణపురం కాలనీలో 10వ వార్డు సచివాలయానికి చెందిన వార్డు కన్వీనర్లు, గృహ సారథులు, కార్యకర్తలతో గురువారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారి బాధ్యతలు, విధి విధానాలు పార్టీ అభివృద్ధిలో వారి భాగస్వామ్యంపై కూలంకషంగా వివరించడంతో పాటు ఈనెల 18వ తేదీ నుంచి గృహ సారథులంతా ఇంటింటికీ వెళ్లి నిర్వహించబోయే 'జగన్ అన్నే మా భవిష్యత్తు' ప్రచార కార్యక్రమం నిర్వహణపై అనుసరించాల్సిన విధివిధానాలపై వారికి సవివరంగా తెలియజేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే జోగారావు మాట్లాడుతూ పురపాలక సంఘంలో వార్డు సచివాలయాల కన్వీనర్లు, గృహ సారథుల పరిధిలో గల ప్రతి ఇంటికి వలంటీర్ల సహకారంతో వెళ్లి వారి అవసరాలను గుర్తించి వాటి పరిష్కారానికి ప్రభుత్వం దృష్టికి తీసుకు రావాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను వివరించడంతో పాటు ప్రత్యేకంగా వారికి ఈ మూడన్నరేళ్ల కాలంలో అందచేసిన సంక్షేమ పథకాలను వివరించాలని చెప్పారు.

2024లో ఘనవిజయమే లక్ష్యం

ప్రతి కుటుంబంలోని ప్రజలందరి పూర్తి మద్దతు కోరుతూ సీఎం వైఎస్‌జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ సీఎంగా గెలిపించు కోవాలని, అందుకు వారి దీవెనలు అందుకోవాలని సూచించారు. రానున్న కాలంలో వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేస్తూ 2024 సాధారణ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధించడమే ప్రధాన కర్తవ్యంగా పని చేయాలని కోరారు. ముఖ్యంగా రానున్న కాలంలో పార్టీ కార్యక్రమాలలో జోరుగా పాల్గొనాలని దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, పట్టణ జేసీఎస్ కన్వీనర్ గొర్లి మాధవరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ వానపల్లి శంకర్రావు, వార్డుల ఇన్‌చార్జ్‌లు, సీనియర్ నాయకులు, సచివాలయం కన్వీనర్లు, వార్డు గృహ సారథులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఈనెల 31లోగా పన్నులు చెల్లించాలి

- మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడు



పార్వతీపురంటౌన్: మున్సిపాలిటీ పరిధిలో బకాయి ఉన్న పన్నులను ఈనెల 31లోగా చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడు కోరారు. ఈ మేరకు స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఇంటి పన్నులు, నీటి చార్జీలు, ఖాళీ స్థలాలు, ప్రకటన, టెంపరరీ ఎంక్రోచ్‌మెంట్ పన్నులు, ట్రేడ్ లైసెన్సులను నెలాఖరులోగా చెల్లించి పురపాలక సంఘం అభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. పన్నుల వసూలుకు పురపాలక సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటరులో గాని, సచివాలయముల వద్ద గాని చెల్లించి తగిన రశీదును పొందాలని సూచించారు. ఈ నెల చివరి నాటికి చెల్లించని పక్షంలో 24% అపరాధ రుసుం విధిస్తామని స్పష్టం చేశారు.

సమయపాలన తప్పనిసరి



ఫీల్డ్‌అసిస్టెంట్లతో మాట్లాడుతున్న ఎంపీడీఓ భానుమూర్తి

బలిజిపేట: ఉపాధి వేతనదారులు సమయపాలన పాటించేలా చూడాలని ఎంపీడీఓ భానుమూర్తి ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. ఈ మేరకు బలిజిపేట ఎంపీడీఓ కార్యాలయంలో ఫీల్డ్‌అసిస్టెంట్లతో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉదయం 7గంటలకు పని ప్రారంభించి రెండు పూటలా పనిచేయించాలని చెప్పారు. ఒకరికి బదులు మరొకరిని పనిలోకి అనుమతించకూడదన్నారు. నిర్ధారించిన కొలతల ప్రకారం పనిచేస్తే గిట్టుబాటు వేతనం వస్తుందని వారికి సూచించాలన్నారు. సమయానికి మస్టరు వేయాలని, మస్టరు వేసిన తరువాత బయటకు ఎవరు వెళ్లిపోకుండా చూడాలని స్పష్టం చేశారు. సమావేశంలో ఏపీఓ కేశవరావు, సిబ్బంది పాల్గొన్నారు.

టౌన్ రైల్వే స్టేషన్ తొలగింపు అవాస్తవం

- ప్రతిపక్షం దుష్ప్రచారం నమ్మవద్దు
- ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురంటౌన్: పార్వతీపురం టౌన్ రైల్వే స్టేషన్ తొలగింపు ప్రచారం అవాస్తవమని ఎమ్మెల్యే అలజంగి జోగారావు స్పష్టం చేశారు. ఈ ప్రచారాలపై స్పందించిన ఆయన ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా వర్గాల ముందే రైల్వే డీఆర్‌ఎంకు గురువారం ఫోన్ చేసి ఇక్కడ జరుగుతున్న అసత్య ప్రచారంపై వివరణ అడిగి వాస్తవం వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వేస్టేషన్ తొలగింపు అంటూ టీడీపీ చేస్తున్న ప్రచారం అవాస్తవమని కొట్టిపారేశారు. కేవలం రాజకీయ లబ్ధి కోసం ఇలాంటి అసత్య ప్రచారాలను టీడీపీ నాయకుడు ద్వారపురెడ్డి జగదీష్ చేస్తున్నారని ఆరోపించారు. ఆయన ఒక ఏంబీఏ గ్రాడ్యుయేట్‌గా వాస్తవం తెలుసుకుని మాట్లాడాలని, రైల్వేస్టేషన్ తొలగిస్తున్నామని తమ అధినాయకులపై తప్పుడు ఆరోపణలు చేస్తుంటే ఆయన అసత్య ప్రచారాన్ని తాము పూర్తిగా ఖండిస్తున్నామన్నారు.

కేంద్రం పరిధిలోని అంశం

పార్వతీపురంలో ఉన్న బెలగాం రేల్వేస్టేషన్ ఆధునీకరణ తప్ప తొలగింపు ఆలోచన ప్రభుత్వానికి లేదన్నారు. అయినా ఈ విషయం పూర్తిగా కేంద్ర ప్రభుత్వం చేతిలో ఉంటుంది తప్ప రాష్ట్ర ప్రభుత్వం చేతిలో ఉండదన్న విషయం తెలుసుకుని జగదీష్ మాట్లాడాలని ఎమ్మెల్యే హితవు పలికారు. టీడీపీ చేస్తున్న అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని ఎమ్మెల్యే అలజంగి జోగారావు మీడియా ముఖంగా వాస్తవం తెలియజేశారు.

ఓటర్ల జాబితా ప్రదర్శన



ఓటర్ల జాబితాను ప్రదర్శిస్తున్న ఎంపీడీఓ పార్వతి

సాలూరు: మండలానికి సంబంధించిన ఓటర్ల జాబితాను ఎంపీడీఓ పార్వతి గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం నోటీస్‌బోర్డులో ప్రదర్శించారు. జెడ్పీటీసీ సభ్యుడి ఎన్నిక నిర్వహించనున్న నేపథ్యంలో కొత్త ఓటర్ల జాబితా రూపొందించినట్లు ఆమె తెలిపారు.

విద్యార్థులకు నేత్ర పరీక్షలు



విద్యార్థులకు నేత్ర పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు

మక్కువ: వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం నేత్ర పరీక్షలు నిర్వహించారు. 181 మంది విద్యార్థులను పరీక్షించి 13 మందికి కళ్లద్దాలు అవసరమని గుర్తించినట్లు డాక్టర్ ఎస్.ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రామకృష్ణ, ఆర్. శంకరరావు, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

గరుగుబిల్లి: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందజేస్తున్న పౌష్టికాహారాన్ని బాలింతలు, గర్భిణులు విధిగా తీసుకోవాలని ఎంపీడీఓ జి.పైడి తల్లి అన్నారు. మండలంలోని కొత్తూరులో అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె గురువారం పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నిర్దేశించిన మెనూ ప్రకారం గర్భిణులకు, బాలింతలకు భోజనం, ఇతర పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. ఆమె వెంట ఎంఈఓ నాగభూషణరావు తదితరులు ఉన్నారు. అనంతరం కొత్తూరు ఎంపీపీ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించారు.

సాధ్యం కాని లక్ష్యాలు సరికాదు



నిరసన తెలుపుతున్న తపాలా ఉద్యోగులు

పార్వతీపురం టౌన్: పనిలో ఆచరణకు సాధ్యం కానీ లక్ష్యాలను తపాలా డీజీ కార్యాలయం నిర్ణయించడం సరికాదని, ఆలిండియా గ్రామీణ డాక్ సేవక్స్ యూనియన్ డివిజన్ కార్యదర్శి ఎం.అప్పారావు అన్నారు. ఈ మేరకు గురువారం స్థానిక తపాలా కార్యాలయం వద్ద యూనిట్ సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీడీఎస్ కమిటీ సిఫార్సు చేసిన విధంగా సీనియర్ జీడీఎస్ ఉద్యోగులకు 12, 24, 36 ఏళ్ల సర్వీసులకు అదనంగా ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఉమామహేశ్వరరావు, బి.ప్రభాకరావు, హేమలత తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ చిన్నారులకు వైద్య పరీక్షలు



నర్సిపురంలో చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి తిరుమల ప్రసాద్

పార్వతీపురంటౌన్: ఫ్యామిలీ డాక్టర్ విధానంలో అంగన్వాడీ కేంద్రాల్లో వైద్య సేవలు అందిస్తున్నామని వైద్యాధికారి తిరుమల ప్రసాద్ అన్నారు. ఈ మేరకు గురువారం మండలంలోని నర్సిపురం గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా చిన్నారులకు వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి 15రోజులకొకసారి గ్రామంలో నిర్వహించే ఈ వైద్యశిబిరాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామాల్లో నిర్వహించే ఈ వైద్యశిబిరంలో 14రకాల వైద్యపరీక్షలను నిర్వహిస్తున్నామని, 62రకాల మందులు అందుబాటులో ఉన్నాయని, రోగికి అవసరమైన మేరకు మందులను అందజేస్తున్నామన్నారు. ఫ్యామిలీ డాక్టర్ విధానానికి మంచిస్పందన లభిస్తోందన్నారు,. ప్రజలంతా ఈ వైద్యశిబిరాన్ని వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, సీహెచ్ఓలు, 104 సిబ్బంది, డేటాఎంట్రీ ఆపరేటర్‌లు పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన



నేత్ర వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

పార్వతీపురంటౌన్: స్థానిక లయన్స్ కల్యాణ మంటపంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు యు.రాజేశ్వరరావు, బి.మల్లికార్జునరావుల పర్యవేక్షణలో జరిగిన వైద్య శిబిరానికి సుమారు 155 మంది కంటి పరీక్షల నిమిత్తం వచ్చారు. విజయనగరం పుష్పగిరి కంటి ఆస్పత్రి వైద్యులు ఉచితంగా పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్యపరీక్షల్లో సుమారు 15 మందికి పైగా కంటి శుక్లాలు ఉన్నట్లు గుర్తించామని వారికి లయన్స్ క్లబ్ ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో కోశాధికారి ఆర్. శ్రీనివాసరావు, అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఉగాదికి జగనన్న గృహనిర్మాణాలు పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాతున్న ఎంపీడీఓ కృష్ణమహేష్‌రెడ్డి

సీతానగరం:

మండలంలోని జగనన్న కాలనీల్లో గృహాల నిర్మాణం పూర్తి చేసి ఉగాది పర్వదినం రోజున గృహ ప్రవేశాలు చేయడానికి ఇంజినీరింగ్ సహాయకులు సిద్ధం చేయాలని ఎంపీడీఓ బి.కృష్ణమహేష్‌రెడ్డి కోరారు. ఈ మేరకు గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఈఓపీఆర్డీ కె.కుమారవర్మ అధ్యక్షతన గృహనిర్మాణ శాఖ సిబ్బంది, ఇంజినీరింగ్ సహాయకులు, డిజిటల్ సహాయకులు, టెక్నికల్ సహాయకులతో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో సకల సౌకర్యాలతో ఇళ్ల నిర్మాణం చురుగ్గా జరుతోందని తెలియజేవారు. ఇంకా మిగిలిన ఇళ్ల పనులు సకాలంలో పూర్తి చేయడానికి లబ్ధిదారులతో అవగాహన సదస్సులు నిర్వహించి ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి ఉగాది నాటికి కొత్త గృహప్రవేశాలు జరిగేలా చూడాలని సూచించారు. ఇప్పటికే కొన్ని గ్రామాల్లో గృహప్రవేశాలు జరగడంతో పేదల సొంతింటి కల నెరవేర్చుకున్నారన్నారు. ఈఓపీఆర్డీ కుమారవర్మ మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో ఉగాది రోజున పండగ వాతావరణం, సొంతింటి కల నేరవేర్చుకోవాలని పిలుపునిచ్చారు.

ఓటు వేసే విధానంపై అవగాహన అవసరం

ఈ నెల 13న జరగనున్న ఉత్తరాంధ్ర గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నిక ఓటింగ్ సందర్భంగా ఓటు వేసే విధానంపై ఓటర్లు అవగాహన కల్పించుకోవాలని ఎంపీడీఓ కృష్ణమహేష్‌రెడ్డి హితవు పలికారు. కలెక్టర్ ఉత్తర్వుల మేరకు గురువారం మండల పరిషత్ ఆవరణలో ఓటు వేసే విధానంపై ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని వేలాడదీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాసనమండలికి ఓటు వేసే విధానంపై ఓటర్లకు అవగాహన కల్పించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కార్యాలయం ఏఓ ఎంఎల్‌ఎన్ ప్రసాద్, ఈఓపీఆర్డీ కె.కుమార వర్మ, తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ ధరలపై నిరసన



:నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

పార్వతీపురం: కేంద్రప్రభుత్వం పెంచిన వంట గ్యాస్ ధరలు తగ్గించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలో నిరసన చేశారు. ఈ సందర్భంగా పార్టీ నాయకురాలు కె.సుబ్బారావమ్మ మాట్లాడుతూ ఇంటికి వాడుకునే గ్యాస్‌పై రూ.50లు, వాణిజ్య వంటగ్యాస్‌పై రూ.350 భారం వేయడం తగదన్నారు. ఇప్పటికే నిత్యావసర వస్తువులు కొనుక్కోలేని పరిస్థితి ఎదుర్కొంటున్న సామాన్యులకు గ్యాస్ కూడా కొనుగోలు చేసుకోలేని పరిస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. పెంచిన గ్యాస్ ధరలను తక్షణమే తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఆర్.వేణు, జి.వెంకటరమణ, ఆర్.ఈశ్వరరావు, వి.ఇందిర తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యకరమైన పంట పండించండి



బర్లిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

బలిజిపేట: రైతులు ఆరోగ్యకరమైన పంటను పండించడం వల్ల ఎంతో మేలు జరుగుతుందని ఏఓ శ్రావణ్ సూచించారు. మండలంలోని బర్లిలో పొలంబడి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా శత్రు, మిత్రపురుగులపై రైతులకు అవగాహన కల్పించారు. ఎరువుల వాడకం, వరి ఉపయోగాలను వివరించారు. చిరుపొట్ట దశలో పొటాష్ 35నుంచి 40కిలోల వరకు మాత్రమే ఎకరాకు వినియోగించాలని సూచించారు. యూరియా 25నుంచి 30కిలోల వరకు వేసుకోవాలని చెప్పారు. సాగుఖర్చు తగ్గించుకుని దిగుబడి పెంచుకునే విధానంపై రైతులకు సూచనలు అందించారు. రైతులు తగిన సమయంలో పురుగులను గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని చెప్పారు. పంట పొలంలో లింగాకర్షక బుట్టలు, పసుపు, తెలుపు జిగురు పల్లాలు పెట్టుకోవడం వల్ల పంటను ఆశించే రసం పీల్చు పురుగులు, వరి వెన్ను దశలో వచ్చే కాండం తొలుచు పురుగును నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో వీఏఏ చాందిని, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సీతంరాజు సుధాకర్ విజయానికి కృషి చేయండి

- వైఎస్సార్‌సీపీ నాయకులకు ఎమ్మెల్యే దిశానిర్దేశం



ఎన్నికల ప్రచార కార్యక్రమంలో ఎమ్మెల్యే జోగారావు, నియోజకవర్గ పరిశీలకురాలు శోభా హైమావతి

పార్వతీపురం టౌన్:

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే జోగారావు పిలుపునిచ్చారు. ఈ మేరకు నియోజకవర్గంలోని 9 పోలింగ్ స్టేషన్ల పీఓసీలు, నాయకులతో నియోజకవర్గ పరిశీలకురాలు శోభా హైమావతి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 13వ తేదీన జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎంపిక చేసిన అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలని కోరారు. అనంతరం ఎమ్మెల్సీ ఎన్నిక ప్రచార పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో మూడు మండలాలు, పురపాలకసంఘం ప్రజాప్రతినిధులు, నాయకులు కన్వీనర్‌లు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో ప్రచారం

వైఎస్సార్‌సీపీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ని ఎమ్మెల్సీ ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు కోరారు. ఈ మేరకు గురువారం పురపాలక సంఘంలోని 29,30,01 వార్డుల్లో నియోజకవర్గ పరిశీలకురాలు శోభా హైమావతి ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర జిల్లాల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ అభ్యర్థిత్వాన్ని బలపరచాలని కోరారు. విద్యావంతులు యువకులు సీతం రాజు సుధాకర్‌కు మద్దతు పలికి అత్యధిక మెజారిటీతో గెలిపించేలా కృషి చేయాలని కోరారు. మొదటి ప్రాధాన్యత క్రమం ఓటు 1 సీతంరాజు పేరు ఎదురుగా వేసి గ్రాడ్యుయేట్ ఓటర్లందరికీ తెలపాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోనుగౌరీశ్వరి, వైస్‌చైర్పర్సన్ రుక్మిణి, మున్సిపల్ వైస్‌చైర్మన్ యిండుపూరు గున్నేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, జేసీఎస్ కన్వీనర్ గొర్లి మాధవరావు, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు గ్రాడ్యుయేట్ ఓటర్లు తదితరులు పాల్గొన్నారు.

సీతంరాజు సుధాకర్‌ను గెలిపించండి

బలిజిపేట: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని జెడ్పీటీసీ రవికుమార్ కోరారు. ఈ మేరకు మండలంలోని వెంగాపురంలో గురువారం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వం మద్దతుతో ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థిని గెలిపించుకుని పార్టీ బలాన్ని రుజువు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మురళి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మురళీకృష్ణ, నారాయణపురం ఎంపీటీసీ రామకృష్ణనాయుడు, మండల వ్యవసాయ సలహా సంఘం అధ్యక్షుడు గంగయ్య, శివరాంపురం సర్పంచ్ ఆర్.శ్రీనివాసరావు, కె.గోపీనాయుడు, కె.కృష్ణ పాల్గొన్నారు.



బలిజిపేట: వెంగాపురంలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

భారీ మెజార్టీతో గెలిపించాలి

సీతానగరం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని వ్యవసాయ సలహాకమిటీ జిల్లా చైర్మన్ వి నాగేశ్వరరావు కోరారు. ఈ మేరకు గురువారం ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా చినంకలాం, గాదెలవలస, జానుమల్లువలస, దయానిధిపురం, కేఏస్‌పురం గ్రామాల్లో జెడ్పీటీసీ సభ్యుడు ఎం.బాబ్జీ, ఎంపీపీ ప్రతినిధి బి శ్రీరాములు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బి.చిట్టిరాజు ప్రచారం చేశారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ ఎ.కృష్ణంనాయుడు, మాజీ ఎంపీపీ కె.రత్నాకర్, ఆయాగ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.



సీతానగరం: కేఏస్ పురంలో ఓటరుకు నమూనాపత్రాన్ని అందజేస్తున్న చైర్మన్ వి నాగేశ్వరరావు